తొంగిచూసి నవ్వుతుంటున్న పిల్లలికి రెండువేసి, వెళ్ళగొట్టి ఇల్లాలును బ్రతిమాలాడాయన. ఇపుడు నేనేమన్నానే - అంటూ.

అవిడ కోపం తగ్గినందువల్లనో, అన్నం మాడువాసన వచ్చినందువల్లనో మొత్తానికి అవిడ గుమ్మంమీంచి లేచింది.

భోజనం అయి అమ్మయ్య అనేసరికి అఫీసరుగారి జవాను కబురుతెచ్చాడు- ఆయాసపడుతూ. అదెంత పనో అని వెళ్ళిన వాడికి ఆయన నడ్డివిరిగే పని చెప్పాడు. పిల్లలకి మ్యాపులు వేసిపెట్టాలయ్యా గొడవ పెడుతున్నారు-అంటూ అటు తిరిగి పడుకున్నా డాఫీసరుగారు.

ప్రపంచంలో విద్యావిధానాన్ని రద్దుచేస్తూ, సంతాన నియంత్రణం కఠినంచేస్తూ ఓ పగటి కల కని, పని పూర్తిచేసి నాలుగింటి కింటికి చేరిన కుటుంబరావుగారు వాలుకుర్చీలో రామ చంద్రా అంటూ వాలిపోయారు.

ఈసారి సెలవునాడు పూర్తి రెస్టు తీసుకోవాలండీ అన్నారు ఎదురుగా లేని నాతో. పదిహేనేళ్ళుగా నడుస్తోందాయన కల. ఇంకా ఫలించలేదు. నా కొకటే మార్గం తోచింది. ఈసారి సెలవునాడు పదినిమిషాలు తీరిక చేసుకుని-ఒక సెలవునాడు పూర్తిగా రెస్టు తీసుకున్నట్టు ఒక టెక్నికలర్ పగటికల కనిపారెయ్యడం మంచిది అని. ○○○

(ఆలిండియా రేడియో సౌజన్యంతో)












# ఆశించని ఆనందం

లోపల్నుంచి తెరలు తెరలుగా వచ్చే బాధతో మెలితిరిగి పోతున్నది నాగరత్నం. ఆగలేక ఒకోక్కసారి "అమ్మా!" అని అరుస్తున్నది గట్టిగా. తలంతా చిందర వందరగా రేగి, ముంగురులు ముఖాన్ని కప్పడానికి ప్రయత్నిస్తున్నాయి. వచ్చటి నుదుటిమీద నల్లటి ముంగురులు, వింత అందాన్ని తెస్తుండే కూతురివైపే చూస్తున్నది చిట్టెమ్మగారు.

"అమ్మాయిగారికి కాస్త వేడి వేడి కాఫీ యివ్వండమ్మా. కడుపులో కాస్త వేడి నీళ్ల పడ్డాయంటే, త్రాణ వస్తుంది" అన్నది మంత్రసాని మాలక్ష్మి. అమ్మాయిగారి పేరుతో తన గొంతుకూడా తడుస్తుంది కదా అన్న ఆశతో.

'ఈ గండం ఎలాగోలా కాపాడు వెంకన్నబాబూ' అనుకుంటూ కాఫీ తేవడానికి యింట్లోకెళ్ళింది చిట్టెమ్మగారు.

"ఊరికే అరుస్తే పోతుందా అమ్మాయిగోరూ! కాస్త ఉగ్గపెట్టుకోవాలిగాని", పక్కలు సవరిస్తూ "అయినా, తెలియనితనం, అందులో తొలిచూలాయె" నెమ్మదిగా గొణుక్కుంది మాలక్ష్మి.

మాలక్ష్మికి వృద్ధాప్యం పైబడినా పురుటి కేసులకు వెళ్ళడం మానలేదింకా. పెద్ద పెద్ద యిళ్ళన్నీ ఆమె చేతిలోనే ఉంటాయి. ఆమెను కదిపితే చాలు. తను ఎవరింట్లో ఎన్ని పురుళ్ళు పోసిందీ, ఆనాడు తను బొడ్డుకోసి ప్రపంచంలో ప్రవేశింపజేసిన బిడ్డకు తనే మళ్ళీ పురుడు పోసిన సంగతి వరకు వర్ణించి చెప్పుకొస్తుంది.

ఆ మధ్య మరీ అవస్థగా ఉందని ఒక ప్రసూతి కేంద్రం స్థాపించారక్కడ. ఒక మిడ్‌వైఫ్, అనుభవంగల ఒక నర్సుకూడా వచ్చి అక్కడే మకాం పెట్టారు. కాని ఏం లాభం? వాళ్ళను ఒక్కళ్ళూ పిలవరు. ఒకవేళ చొరవగా వాళ్ళే వెళ్తే "మాకు మా మంత్రసాని ఉందిలెండమ్మా, మీ అవసరం లేదు" అని ముఖంమీదే అని సాగనంపేస్తారు.

ఒకవేళ ఎవరన్నా నాగరికులు వాళ్ళని పిలిపిస్తే, ఈ సంగతి తెలిసిన మాలక్ష్మి ఆఘమేఘాలమీద వెళ్ళి వాళ్ళనక్కడనుంచి తరిమేసేవరకూ ఊరుకునేది కాదు.

నాగరత్నం ప్రొద్దుటినుంచికూడా నొప్పులు పడుతూనేవుంది. ఆమె పడే బాధ వర్ణనాతీతం. అది చూసి భరించలేక పోతున్నాడు తండ్రి భూషయ్య. అక్కడికీ ఉండబట్టలేక "పెద్ద డాక్టరమ్మను తీసుకురానా" అని అడిగాడు అదుర్దాపడే స్వరంతో. "ఊరుకోండి. మాలక్ష్మి ఇక్కడే వున్నది విన్నదంటే...." గుసగుసలుగా అన్నది చిట్టెమ్మగారు.

"మరీ సోద్యాలు పోతారేమ్మట్టా. ఇదివరకంతా మేము పురుళ్ళు పోసుకోలేదా, సుఖంగా లేమా? మా అత్తకు పోసింది, నాకు పోసింది, నా కోడలికి పోసింది, ఈ మాలక్ష్మివాళ్ళే కదా? దీని హస్తవాసి ఎంత మంచిది కాకపోతే మీరంతా చల్లగా ఉంటారు? గుమ్మంలోదాన్ని విడిచిపెట్టి ఎక్కడో ఉన్నదానికోసం పరుగు లెట్టానంటావేం?" కాస్త ఘాటుగానే మందలించింది భూషయ్య తల్లి రావమ్మగారు.

"అది కాదే...." ఏదో చెప్పబోయాడు భూషయ్య. అతని మాట కడ్డం వస్తూ "ఏదీ కాదు! అయినా మా తిప్పలు మావిగాని, కాస్సేపు నువ్వు బైటకుపో. నువ్విక్కడున్నంత సేపూ, నీకూ తోచదు, మాకూ తోచనివ్వవు" మెత్తగా కసురుకుంది రావమ్మగారు. తల్లిమాటకి అయిష్టంగానే కదిలాడు భూషయ్య.

"ఇదిగో, మిమ్మల్నే! వెళ్ళమన్నారు కదా అని పొలిమేర దాటిపోయేరు కొంపదీసి. ఏ క్షణాని కేం అవసరం వస్తుందో, కాస్త ఈ చుట్టుప్రక్కలే పిలుపుకు అందేలా ఉండండేం." పిలిచి చెప్పింది చిట్టెమ్మగారు.

ఓ చెవితో వాళ్ళ సంభాషణంతా వింటున్న మాలక్ష్మికి, గుండె కుదుటబడింది. గొప్పింటి పడుచులు నీళ్ళాడితే చాల పెద్ద మొత్తమే దొరుకుతుందని కొండంత ఆశతో ఎదురుచూస్తుంది మాలక్ష్మి. అందులో భూషయ్య ఆ ఊరిలోకెల్లా ధనవంతుడని పేరుబడినవాడు. పైగా ఒక్కర్తే కూతురు. నాగరత్నం చాల అపురూపంగా పెరిగింది. అతని గారాబు కూతురికి పురుడుపోస్తే తనకు లోటులేకుండా పెద్ద మొత్తమే ముడుతుందని మాలక్ష్మి ఆశ.

"ఇంకెంత సేపటికి వస్తుందంటావు?" ఆత్రుతగా అడిగింది, చిట్టెమ్మగారు.

"మనుమడిని ఎప్పుడు ఎత్తుకుందునా అని అమ్మగారి ఆత్రం. ఇదిగో, పెద్దనొప్పు లారంభించాయి. ఇంకాసేపటికో, కూసేపటికో పండంటి అబ్బాయిని చూడరూ!" బోసినోటితో నవ్వులు గుమ్మరిస్తూ నాగరత్నంవైపు చూసింది మాలక్ష్మి.

'పండంటి అబ్బాయి' అన్న మాట చెవుల్లో పడగానే అదిరిపడింది నాగరత్నం. "అబ్బాయి! అమ్మో, అబ్బాయే? వద్దు వద్దు అబ్బా యెందుకు? అమ్మాయే కావాలి; నాకు అమ్మాయే కావాలమ్మా లేకపోతే వారు, వారు ... రానివ్వరే నన్ను" అంత బాధలోనూ నాగరత్నం గట్టిగా అరచి చెప్తుంటే చిట్టెమ్మ, రావమ్మగార్లు, మాలక్ష్మి అందరూ విభ్రాంతులై రత్నంవైపు చూస్తూండిపోయారు

తను ఈ అయిదు సంవత్సరాలనుంచి దాచుకొస్తున్న రహస్యం కాస్తా ఈ నాటితో బైటపడిపోతుంది కాబోలునని శంకిత మనస్కురాలైంది రత్నం.

ఆమె భయమేకాని ఎవరూ ఏమీ అనుమానించలేదు. ఏమిటని ఆరా తీయనూలేదు. ఇంతకి రెట్టింపు బాధపడినాసరే. ఈ బాధలో తన ప్రాణాలు పోయినా సరేగాని, మగపిల్లాడు మాత్రం వద్దు. ఈ సారి మనస్సులోనే అనుకుంది రత్నం.

పాపం నాగరత్నానికి తెలియదు; పాతిక సంవత్సరాల క్రితం తన అత్తగారుకూడా ఇదే అవస్థలో ఇట్లాగే భగవంతుని ప్రార్థించిందని. కాని ఆమె కోరికకూడా ఇట్లాగే వ్యర్థమైపోయిందని. తెలిస్తే ఏం చేసేదో మరి...."

తను వచ్చేస్తోంటే అత్తగారు "బంగారు బొమ్మలాంటి అమ్మాయి నెత్తుకురావాలి సుమా!" అన్నది. పైకి ఆప్యాయత కనబరచినా అంతరంగంలో మాత్రం "నువ్వు గాని అబ్బాయిని కన్నావో నీ కాపురంలో నీళ్ళే సుమా!" అన్న భావాన్ని వ్యక్తం చేసింది.

ఇక భర్త విశ్వనాథం కఠోరంగా ఆజ్ఞాపించాడు. "ఇదిగో - విన్నే. నాకు అమ్మాయంటేనే యిష్టం సుమా! అమ్మాయితో గాక అబ్బాయితో వచ్చావా? ఇక నీకూ నాకూ రామ్ రామ్. ఇక నువ్వు నా గడపలో కాలు పెట్టలేవు తెలుసా! ఇదిమాత్రం జ్ఞాపకంపెట్టుకో...." అని.

ఆ నాటి మాటలు ఇప్పటికీ తన చెవుల్లో ఖంగున ప్రతిధ్వనిస్తూనే ఉన్నవి. ఏ బిడ్డ పుడుతుందో తన కేం తెలుసు? అక్కడికీ ఆగలేక కనిపించిన సాధువులను, జ్యోతిశ్శాస్త్రం తెలిసిన పండితులను అడిగేది సిగ్గు విడిచి. కొందరు "ముద్దబంతి పూవులాంటి అమ్మాయిని గంటావు" అంటే, మరి కొందరు "చందమామలాంటి కొడుకుని ఎత్తుకుంటావు" అని ఆశీర్వదించేవారు. అందుకని తనకు ఫలాన బిడ్డ అని నిర్ధారణ చేసుకోలేకపోయింది రత్నం.

ఈసారి విపరీతమైన బాధతో "అమ్మా" అంటూ ఓ పొలికేకలాంటిది పెట్టింది. ఆ వెంటనే ఏదో పెద్ద బరువు దిగిపోయినట్లు, కడుపంతా చాల తేలికైపోయినట్లు అనుభూతి పొందిన వెంటనే గాఢంగా నిశ్వసిస్తూ సొమ్మసిల్లినట్లు పడిపోయింది రత్నం. ఆ అర్థ చైతన్యావస్థలోనే, తల్లి, నాయనమ్మ ఒకేసారిగా "ఏ బిడ్డ?" అనడం, మాలక్ష్మి "చందమామలాంటి అబ్బాయిగోరమ్మా; ఈ సారి పట్టుదీర తప్పదులెండి" అనడం లీలగా వినిపించింది. ఏదో చెప్పాలన్నట్లు

ఎమ్. ప్రభావతి

పెదవులు కదిపినప్పటికీ చీకటిలాంటి తెర కమ్మేసినందున ఏమీ చెప్పలేకపోయింది నాగరత్నం.

● ● ●

కొందరి కొందరి జీవితాల్లో అనుకోని సంఘటనలు అతి విచిత్రంగా తటస్థపడుతూ, వాళ్ళ జీవితగతులనే మార్చివేస్తాయి అటువంటి విచిత్ర సంఘటనతోనే నాగరత్నం ఒక యింటిదైంది.

అప్పటికి నాగరత్నం పదిహేనేళ్ళ బాలిక. చూసే యువక హృదయాలను వెత్తిత్తించే అందమామెది. ప్రతి యువకుడూ ఆమెతో మాటలు కలపడానికి, స్నేహం చేసుకోవడానికి ఉబలాటపడేవాడేకాని అందుకేమాత్రమూ అవకాశం యిచ్చేదికాదు నాగరత్నం.

ఒకసారి ఎవరో దూరపు బంధువుల యింటికి పెళ్ళినిమిత్తమై వెళ్ళారు నాగరత్నం, తల్లి, తండ్రి, నాయనమ్మలతో సహా. అతను మగపెళ్ళివారి తరపు బంధువులలో ఒకడు. మనిషి చూపులకు అందమైన వాడిగానే కనిపిస్తాడు. కాని అతని గుణమే అదోరకమైనదని ఒక్క రోజులోనే నిర్ణయాని కొచ్చిన నాగరత్నం అతన్ని చాల అసహ్యించుకోసాగింది. అతను ప్రతి చోట తారసిల్లడం, అవసరం లేకపోయినా పెళ్ళికాని పిల్లలను పలకరించడం, వాళ్ళెదురుగా గూఢార్థంతోకూడిన మాటలు విసరడం, వెనకపాటుగా వెళ్ళి వాళ్ళ జడలుపట్టుకుని లాగడం, చూడనట్లు నటిస్తూ వాళ్ళని రాచుకుంటూ తిరగడం. ఇదంతా చూస్తున్న నాగరత్నం చాలా కోపగించుకుంది. ఇదొక్కటేకాదు నాగరత్నం కోపానికి కారణం. పనిలేకపోయినా అతను తనను పలకరించబోవటం, తను విననట్లుగా తప్పించుకుపోవటం జరిగేవి. నాగరత్నం అతన్ని ఎంత చీదరించుకునేదో అతనంతగా వెంటాడేవాడు అక్కడున్న మూడురోజులు మూడు యుగాల్లా గడిపింది నాగరత్నం. ఇంకా రెండు రోజులు ఆగమని పెళ్ళివారు ప్రతిమాలినా, నాగరత్నం బలవంతంమీదే ఇంటిముఖం పట్టారు పెద్దవాళ్ళు.

ఇది జరిగి పక్షం రోజులు గడిచాయో లేదో నాగరత్నాన్ని చూడటాని కెవరో వస్తున్నారని, వాళ్ళకి చాల ఆస్తి వుందని, ఒక్కడే కొడుకని చెప్పుకోసాగారు అమ్మలక్కలు.

తన జీవిత భాగస్వామి గురించి బంగారు కలలు కంటున్న నాగరత్నాని కీమాటలు మధురానుభూతుల నందజేశాయి. అనుకున్న వేళకి పెళ్ళివారు రానే వచ్చారు. బ్రహ్మాండమైన ఏర్పాటులతో ఘనంగానే సత్కరించారు ఆడపెళ్ళివారు మగ పెళ్ళివారిని.

అసలే అందమైనది. అందులో పెళ్ళిచూపులకోసం ప్రత్యేకంగా అలంకరించారేమో ఆ సమయంలో నాగరత్నం దివి నుండి భువికి దిగివచ్చిన దేవకన్యలా మెరిసిపోయింది. తల్లి, నాగరత్నాన్ని తీసుకొచ్చి పెళ్ళివారికెదురుగా కుర్చీలో కూర్చోపెట్టి వెళ్ళిపోయింది. సిగ్గుల బరువుతో తలన్నా ఎత్తి చూడలేకపోయింది.

ఒకప్రక్క మనస్సు పూరికే పీకుతున్నది. 'ఒక్కసారి తలెత్తి చూస్తే ...' అని. కాని స్త్రీ సహజమైన సిగ్గు సంకోచాలు, ఆమె తలను ఎత్తనివ్వటంలేదు. నిముషాలు దొర్లిపోతున్నాయి. వరుడి తరపువారినుంచి ఏవో ప్రశ్నలు వస్తున్నాయి. వాటి కన్నిటికీ తండ్రే జవాబిస్తున్నాడు ఓపిగ్గా. కూర్చుని కూర్చుని నడుం నొప్పిపెడుతున్నది నాగరత్నానికి. ఆమె అవస్థ కనిపెట్టారా అన్నట్లు ఎవరో అన్నారు. "ఇక లోపల కెళ్ళిపోమ్మా" అని బ్రతుకుజీవుడా అని లేచింది.

'ఇదే మంచి సమయం అతన్ని చూడటానికి, ఇది దాటిందంటే మళ్ళీ నీకా అవకాశం వుండదు' అని మనస్సు హెచ్చరించింది. దానితో చటుక్కున తలెత్తిచూసింది. అంతే, తన కాళ్ళక్రింద భూమి క్రుంగిపోతున్నట్లు, తనని పాతాళ లోకంలోకి లాక్కుపోతున్నట్లు కంపించిపోయింది. తను చూసేది యథార్థమేనా? లేక తన కళ్ళు చేస్తున్న మోసమా! భయ సంకోచాలతో మళ్ళా మళ్ళా చూసింది. అవును, అతనే వందమంది మంచివాళ్ళలో నిలబెట్టినా పోల్చుకోగలదు. సందేహంలేదు. ఆనాడు ఎవర్నిచూసి నిలువెల్లా చీదరించుకుందో అతనే, ఇతను. తన కాబోయే భర్తరూపంలో కూర్చుని ఎట్లా కులుకుతున్నాడో? ఆమె మరి అక్కడ నిల్చోలేకపోయింది.

ఇరుగు పొరుగులు, పరిచయస్తులు, బంధువులు అందరూ అడుగుతున్నారు. "పెళ్ళికొడుకుని చూశావా? ఎట్లా ఉన్నాడు? నచ్చినట్లేనా....లేక అనుమానమా? ఆ నచ్చకేం? కన్నొంకరా, కాలొంకరా? బోలెడంత ఆస్తి. వారసుడా ఒక్కడు. అదంతా మన రత్నానిదేనర్రా" అని తలో మాట విసురుతున్నారు. కాని ఆమె వినడంలేదు. ఆమె మనసు ఎక్కడో ఏ దూరతీరాలనో పరిశీలిస్తున్నట్లు నిశ్శబ్దంగా ఉంది ఆమె నర్థంచేసుకోలేని అమ్మలక్కలు "అబ్బో! అప్పుడే ఎంత జాణతనం నేర్చావే? రేపు ఆ మూడుముడులూ పడ్డాయంటే ఇక మాబోటి వారెవరూ నీ కంటికి ఆనరన్నమాటే" అని నవ్వుతున్నారు.

సాధారణంగా కొన్నికొన్ని యిళ్ళలో తల్లిగాని, తండ్రిగాని, అమ్మాయిని పిలిచి 'ఏమ్మా అబ్బాయి నచ్చాడా? నీ కేమైనా అభ్యంతరమా?" అని అడగరు. సరికదా "మనం దాని మంచిని కాంక్షించేవారమే కదా" అన్న తృప్తి ప్రకటిస్తారు.

ఆతరువాత ఆ కష్ట నిష్ఠురాలన్నీ అనుభవించేది ఆ అమ్మాయి.

నాగరత్నం విషయంలో కూడా యిదే నిజమైంది. ఆమె ఎంత విరోధించినప్పటికీ ఈపెళ్ళి అనే సంకెళ్ళనుంచి తప్పించుకోలేకపోయింది. ఏమైనా అనడానికి కూడా

---

● *ఒక మిత్రుడు తన కారును ఇంకోమిత్రుడికి ఇచ్చాడు. రెండోవాడు ఎప్పటికీ రాకపోయేసరికి మొదటి మిత్రుడు కంగారు పడ్డాడు. కంగారు పడుతున్న సమయంలో కారు తీసుకువెళ్ళిన మిత్రుడొచ్చాడు.*

*"అమ్మయ్య! వచ్చావుగదా, ఎప్పుడకీ రాకపోయేసరికి దేన్నో కొట్టావనుకున్నాను"*

*"పడినినట్టుంది — ఎవడేనా నన్నుకొట్టాల్సిందేగాని, నేను మాత్రం చచ్చినా ఒకడిని కొట్టనుసుమా"*

*"అబ్బ! అంత ఘటికుడివన్నమాట"*

*"అవును — ఇప్పుడదే జరిగింది!"*

సందివ్వకుండా ఎంత పుణ్యంచేస్తే యింత గొప్ప సంబంధం వస్తుంది? అని పొగిడే ఆ నోళ్ళకు తెరిపి ఉండడంలేదు. ఇక తను విరోధించి లాభంలేదని విధిమీద భారం వేసి ఊరుకుంది.

అనుకున్న దానికంటే చాల అట్టహాసంగానే జరిగిపోయింది పెళ్ళి. అంతమంది పెద్దలముందు బ్యాండువాయిద్యం హోరులో బ్రాహ్మణ పురోహితుడు మంత్రాలు చదువుతుండగా అతని అర్ధాంగి అయింది నాగరత్నం. ఇప్పుడు తను కాదు అన్నా ఎవరూ అంగీకరించరు. ఇక ఈ జీవితమంతా కష్టమైనా, దుఃఖమైనా, సంతోషమైనా, ఈ విష వలయంలో పడి కొట్టుకోవలసిందే. ఇదే ఈ మూడుముడుల రహస్యం కాబోలు? ఈ పెళ్ళి జరుగుతున్నందుకు తనలో ఏ మధురభావాలు పొంగి పొర్లడం లేదు. ఇదివరకు యెలా ఉందో ఇప్పుడూ అలాగే శూన్యంగా ఉంది.

ఆ రోజు ఏకాంతంగా భర్తదగ్గర కెడుతున్నప్పుడు మనసులో అనుకుంది నాగరత్నం, 'మంచివాడో చెడ్డవాడో, దుర్మార్గుడో సన్మార్గుడో, నీతిపరుడో అవినీతిపరుడో, ఎవరైనాగాని అతన్ని అగ్నిహోత్రంముందు భర్తగా స్వీకరించినపుడు మనసా, వాచా అతన్నే పూజిస్తాను, ప్రేమిస్తాను, సేవిస్తాను, నన్ను నేను సమర్పించుకుంటాను' అని నిశ్చిత మనస్కురాలైంది. అతడు। పందిరిమంచంమీద ఠీవిగా పడుకుని సిగరెట్ మీద సిగరెట్ కాలుస్తూ పొగతో తెల్లటి మేఘాలను సృష్టిస్తూ చిన్మయానందాన్ని పొందుతున్నాడు. గదిలో అడుగు పెడుతూనే సిగరెట్ ఘాటుకి ఉక్కిరిబిక్కిరైపోయిన నాగరత్నం చెంగుతో ముక్కు, నోరు మూసుకుని అక్కడే నిల్చుండిపోయింది బొమ్మలా.


ఒక్క క్షణం కన్నార్పకుండా చూసి అతను దగ్గరగా 'రా' అన్నట్లు సైగచేసి పిలిచాడు. నిల్చున్నదగ్గిరనుంచి ఒక్క అంగుళమన్నా కదలలేదు నాగరత్నం. లేచి కూర్చున్నాడతను. చేతిలో సిగరెట్ కాలుతున్నది అగ్నిశిఖలా.

"నన్ను గుర్తించావా?" అడిగాడు దర్పం ఉట్టిపడే స్వరంతో. కనుబొమ్మలెత్తి చూసింది నాగరత్నం మౌనంగా. "నిన్నే కోరి ఎందుకు చేసుకున్నానో తెలుసా?" ఆ ఒక్క వాక్యంలోను ఎంతో కసి, ద్వేషం, అహంకారం ఇంకా ఇంకా ఎన్నో భావాలు ద్యోతకమవుతున్నాయి. ఈసారి పెదవి కదల్చలేదు నాగరత్నం. భార్య మౌనాన్ని చూస్తుంటే రానురాను సహనం చచ్చిపోతున్నదతనిలో. "ఏం! మాట్లాడవేం?" ఇంచుమించు మేఘంలా గర్జించాడు. "ఆ రోజు అంత అహంకారంతో జవాబిచ్చావు మరి ..ఆ అతిశయమంతా ఏమయింది? ముంగిలా నిల్చున్నావు నా ముందు?" దానికి నిశ్శబ్దమే జవాబయ్యింది.

భార్య రెక్కపట్టుకుని లాగాడు. ఈ హఠాత్ సంఘటనకు నిలదొక్కుకోలేని నాగరత్నం తూలి అతని ఒడిలో పడిపోయింది. ముక్కు దగ్గిర ఆచ్ఛాదన తొలగిపోవడంతో దగ్గుతెర కమ్మేసింది. ఆఖరి దమ్ములాగి సిగరెట్ అవతల పారేసి గుప్ మంటూ వదిలాడా పొగను భార్యముఖం మీదికి. దగ్గుతో ఉక్కిరిబిక్కిరౌతూ చప్పున ముఖాన్ని రెండు చేతుల్లో దాచేసుకుంది నాగరత్నం.

మొదటిరోజు ఇట్లా మొదలైన దాంపత్యంలో ఈనాలుగైదేళ్ళల్లో ఎట్టి మార్పూ రాలేదు. ఇక ముందు వస్తుందనే ఆశాలేదు. మార్పులేని దినచర్యతో యాంత్రికంగా గడిచిపోతున్నాయి రోజులు. తన సంసారం






గురించిగాని, భర్త అలవాట్లు గురించిగాని ఎప్పుడూ ఎవరితోనూ, ఆఖరికి తల్లితో కూడ చెప్పలేదు నాగరత్నం. తన కెలాగూ సుఖంలేదు. ఇకముందు ఉండబోతుంది అనే ఆశా లేనప్పుడు, తన అవస్థలేవో తను పడక, తల్లిదండ్రుల మనస్సుకి కూడ శాంతి లేకుండా చేయడం ఎందుకు? అన్న ఉద్దేశ్యమే అందుకు కారణం.

ఒక్కోసారి భర్త మోటు ప్రవర్తనకు కళ్ళవెంట నీరు తిరిగేది. వయసులో ఉన్న ఇరుగుపొరుగు యువతులు ఇంటికొస్తే తన ఎదుటే వాళ్ళతో సరస సంభాషణలు చేయడం, వాళ్ళ పమిటచెంగులు పట్టుకుని లాగడం, ఇంటి దాసీలతో నవ్వుతూ ఛలోక్తులు విసరడంవంటి దృశ్యాలు కంటబడినప్పుడు భర్త సిగ్గులేనితనానికి ఈసడించుకునేది. లోలోపలే కుమిలిపోయేది కాని పన్నెత్తి ఒక్క మాటన్నా 'ఇది మీకు తగదు' అని హెచ్చరించలేకపోయేది.

సరసుడైన ఆ కొడుకు చేష్టలను చూసి ఆ తల్లి ఒక్కత్తే మురిసిపోయేది. "మా విశ్వం మీ మామగారి పోలికేనే అమ్మాయి! నేను కాపరానికొచ్చినాకూడ ఆయన పోకిళ్లు మానేవారు కాదుసుమా. ఉండబట్టలేక నేనే దెబ్బలాడి, ఏడ్చి, నానా రభస చేసేదాన్ని కాని, అయితే మాత్రం నా అల్లరే కనిపించేది కాని ఆతిరుగుళ్ళు మానారా ఏమైనానా! అసలు మా మామగారుకూడా అలాగే తిరిగేవారటలే! ఇన్ని మాట లెందుకు? అసలీ యింటి వంశోద్ధారకులే అంతట. లేక లేక ఒక్క కొడుకు పుట్టడం, పెద్దవాళ్ళ గారాంతో ఏకు మేకై తిరగటం, ఇదే వరసమ్మా" అని అత్తగారు సగం విచారం, సగం సంతోషం కలిపి చెబుతుంటే నాగరత్నం గుండె లదిరిపడేవి.

అయితే రేపు తనకు పుట్టబోయే బిడ్డకూడా తన తండ్రి అడుగుజాడల్లోనే నడుస్తాడన్న

మాట. భగవాన్! నా కటువంటి కొడుకు వద్దు. అటువంటి కొడుకువలన తనకి సుఖం ఉండదు. ముఖ్యంగా కోడలిగా వచ్చే ఆ అభాగ్యురా లెవరోగాని జీవితాన్ని ఎంతైనా ద్వేషించుకుంటుంది తనలా.

తను జీవితాన్నిగురించి ఎన్ని కలలుగంది, ఏదీ, ఏ ఒక్కటీ నిజంకాలేదు. ప్రతిరోజూ తనకో గండమే. భర్త కోపానికి గురికాకుండా గడిచిన రోజులేదు. ప్రతి చిన్న విషయానికి కోపం ప్రదర్శిస్తాడు. తల దువ్వుకుని శుభ్రమైన బట్టలు కట్టుకుంటే చాలు. "ఏ మొగుడికోసం ఈ సింగారింపంతా?" అరిచేవాడు. అందుకు జడిసి తల దువ్వుకోకుండా మాసిన చీరతో, తిరుగుతుంటే "వెధవముఖం ఎప్పుడూ మడ్డి ఓడుతూనే ఉంటుంది. ఒక శుచి, శుభ్రత ఏమీ లేదు. ఇటువంటి పెళ్ళాన్ని పెట్టుకుని ఏ భర్త సుఖపడగలడు? అందుకే పరాయి కొంపలవెంట పడతారు" అని చీదరించుకునేవాడు. ఒక్క రోజన్నా భర్త అనురాగంతో అప్యాయతగా పలకరిస్తాడేమో అని ఎదురుచూసే నాగరత్నానికి అది గగన కుసుమమే అయ్యింది. ఎప్పుడూ చిరచిర లాడుతూ, కోపంతో ధుమధుమలాడే భర్త ముఖంచూస్తే "ఆదరణగా మాట్లాడకపోతే . పోనీగాని. ఈ క్షణంలో ఏ రభసా జరక్కుండా మాత్రంచూడు భగవాన్" అని భయంతో ఆకులా కంపించిపోయేది.

సంసారంలో సుఖశాంతులు లోపించడం. భర్త ఉగ్ర స్వభావానికి మానసికంగా బాధపడుతూ, దిగులుతో క్రుంగిపోవడంతో నాగరత్నం చాల చిక్కిపోయింది దానికితోడు విపరీతమైన వేవిళ్ళు. ఏమి తిన్నా ఇమడటంలేదు. కొద్దిరోజుల్లోనే తను తండ్రి కాబోతున్నాడని తెలిసినప్పుడు భర్త విశ్వానికి చాల సంతోషమైంది. తన సంతోషాన్ని ఎట్లా ప్రకటించాలో అతనికి తెలియదు. భార్య ఒకర్తీ కూర్చుని ఉన్నప్పుడు అడిగేవాడు "అమ్మ చెప్పినమాట నిజమేనా?" అని. ఆ అడిగే తీరులో ఒక సౌమ్యతగాని అప్యాయతగానికనిపించలేదు. పైగాఅధికారపూర్వకంగా అడిగేటప్పటికి అదిరిపడింది నాగరత్నం. మళ్ళీ ఏ అవాంతరం వచ్చిపడిందో అని భయగ్రస్తురాలవుతూ నెమ్మదిగా "ఏ మాటా?" అంది.

అంతకంటె విడమర్చి ఎలా అడగాలో తెలియలేదతనికి. మొదటినుంచీకూడా అతనికి తను కోరింది చెలిమినో, బలిమినో పొందడమే తెలుసుగాని, స్త్రీ అనురాగాన్ని ఎట్లా పొందాలో, ఆమెను ఎట్లా లాలించాలో తెలియదు. ఒక్కగానొక్క కొడుకన్న గారాబంతో అతనేంకోరితే అది అందజేసేదా తల్లి. పెద్దయ్యి బుద్ధితెలుసుకునే వయసులో చెడు సావాసాలుపట్టి అతను మరింత పాడైనాడు. అందమైన ఆడపిల్ల కనిపిస్తే చాలు అతని కోతిగుణం ఊరుకోనిచ్చేది కాదు. వాళ్ళ వెనకాల పడి అల్లరిపెట్టి, ఏడిపించి, వీలైతే లొంగదీసుకోవడమే అతని ధ్యేయంగా పరిణమించింది.

ఆపెళ్ళిలో నాగరత్నం అందం, హుందాతనం. అతన్ని పూర్తిగా ఆకర్షించాయి. అందుకే ఏదో విధంగా ఆమెతో మాటలు కలపాలని, వీలైతే స్నేహం చేసుకోవాలని కాంక్షించాడు. అందు కవకాశం యివ్వని నాగరత్నం అతన్నో పురుగుక్రింద జమకట్టి చీదరించుకునేది. ఇలా లాభం లేదని ఆమెని అవమానించైనా తనకసి తీర్చుకోవాలని సమయంకోసం చూస్తుండగా, లభించిందా అవకాశం. పెళ్ళి ఊరేగింపుతో బైలుదేరిన నాగరత్నం మధ్యలోనే ఆగి తనకి తలనొప్పిగాఉందని, ఇకముందుకిరాలేననితల్లితో







చెప్పి బయలుదేరింది. ఇటువంటి అవకాశం కోసమే ఎదురుచూస్తున్న విశ్వం గర్వంగా నవ్వుకుంటూ ఆమెను వెంబడించాడు. పెళ్ళివారి యింటికి పోవాలంటే, రోడ్డుదారిన వెళ్తే కాస్త దూరమనిపిస్తుంది. దగ్గరదారిలో వెళ్ళాలంటే రెండుమూడు ఇరుకు సందులు దాటాలి. సందులు నిర్మానుష్యంగా ఉంటాయి. అయినా గుండె ధైర్యంగల నాగరత్నం దగ్గరదారే పుచ్చుకుంది. ఇంకొక్క సందుదాటితే వచ్చే మొదటి యిల్లే పెళ్ళివారిది. నిర్భయంగా నడిచివెడుతున్నది నాగరత్నం. ఆ సందు కాస్తా దాటేస్తే ఇక తన ప్లాను జన్మతో నెరవేరదు అన్న ఆత్రుతతో, కాస్త దూరంగా వెంబడిస్తున్న విశ్వం రెండంగల్లో ఆమె సమీపానికి చేరి గబుక్కున చెయ్యిపట్టుకున్నాడు. ఈ హఠాత్ సంఘటనకు నిర్విణ్ణురాలై క్షణం నిల్చుండిపోయిన రత్నం అంతలో తేరుకుని భయంతో అరవబోయింది కాని, విపరీతమైన భయంవలన ఆమె గొంతు పెగలలేదు. అతని చేతిలోంచి తన చెయ్యి లాక్కోవాలని చాల ప్రయత్నించి. పెనుగులాడింది కాని అంత తేలికగా వదిలేరకం కాదు విశ్వం. అందులో చీకటి ఒకటి అతనికి అండగా నిల్చుందా సమయంలో.

"మాట్లాడించబోతే మా పెడసరంగా తిరిగావే. ఇప్పుడు రమ్మను నీతాత ఎవడు వచ్చి రక్షిస్తాడో" వికటాట్టహాసం చేశాడు విశ్వం. అతని గొంతుబట్టి అతడెవరో, ఎందుకు బలాత్కరిస్తున్నాడో క్షణాల్లో గుర్తుపట్టిన నాగరత్నం. లేడిలా బెదరిపోయింది. 'దుర్మార్గుడు అన్నంతపని చేస్తాడు కాబోలు. ఇప్పుడు తను తప్పించుకునేదెలా? 'ఊరేగింపుతో వెళ్ళినా తనకీ విషమపరిస్థితి తటస్థపడేది కాదేమో? ఎట్లా ఇప్పుడు?' పరిపరి విధాల పోయేమనసుతో చుట్టూ చూసింది. ఎవరన్నా వస్తారేమో, తననీ అవస్థనుండి కాపాడి రక్షిస్తారేమోనని. ఎవరూ వస్తున్న జాడే కనిపించలేదు. ఉన్నట్టుండి "అరే! ఎవరది వచ్చేది?" గట్టిగా అరిచింది నాగరత్నం. అదిరిపడుతూ అటు తల త్రిప్పాడు విశ్వం. ఇదే అదనని అతనిచేతిమీద కరిచింది గట్టిగా. బాధతో అతను 'అబ్బా' అని అరుస్తూ చెయ్యి లాక్కున్నాడు. అంతే సుడిగాలిలా దూసుకుపోయింది నాగరత్నం. కన్నుమూసి తెరిచేలోగా ఇదంతా జరిగిపోయింది. చేతికి చిక్కిన పిట్ట జారిపోయినా, అప్పటి ఆమె సమయస్ఫూర్తికి మెచ్చుకోకుండా ఉండలేకపోయాడు. ఆనాటి పట్టుదలే వాళ్ళ దాంపత్యానికి ప్రథమ సోపానమైంది. కేవలం పట్టుదలేగాక నాగరత్నం గుణం, ఆమె అందం, అతన్ని లొంగదీసుకున్నాయి. కాని భర్తననే అహం

---

● "ఒకాయనకు బోలెడు డబ్బుంది మేడలు, కార్లు, సర్వవసతులూ వున్నాయి. సుఖమూ శాంతీ హాయీ కూడా అతని దగ్గరే వున్నాయి. ఇంతెందుకు — అసలతనిదగ్గర లేనివంటూ లేనే లేవు"

"పొరపాటు — అతని దగ్గర లేనివి రెండున్నాయి — నువ్వు మరచిపోయావు"

"ఏమిటవి?" అన్నాడు మొదటి మిత్రుడు అమితాశ్చర్యంగా.

"చీకూ చింతా"

భావంతో. భార్యను చీటికి మాటికి బాధించటం అతని సరదాలలో ఒకటి.

'గర్భిణీ స్త్రీ ఏది కోరితే అది తెచ్చి పెట్టాలి' అని, ఆమెకు ఫలానిది తినాలనే కోర్కె ఉన్నప్పటికీ సిగ్గు, సంకోచాలవలన ఆ కోర్కెను పైకి వ్యక్తం చేయలేరనే మాటలు అడపా దడపా వింటుండేవాడు కాబట్టి భార్య నోరుతెరచి, తన కోరిక వెల్లడించకపోయినా రకరకాల పళ్ళు, స్వీట్సు తెచ్చి, ఆమె ఎదురుగా ఉంచేవాడు తింటుంది కదా అనే భావంతో. కాని ఎన్ని రోజులైనాసరే అవి అలాగే ఎండి, కుళ్ళి పాడవటమే కనిపించేదికాని, భార్య తిన్న సూచనలేమీ కనిపించేవి కాదు. ఇక అతనికి ఎంతైనా కోపం వచ్చేది. ఛీ, ఈ ఆడాళ్ళు ఏం మనుష్యులో? అని విసుక్కునేవాడు. లేదా భార్యను ఉద్దేశిస్తూ "ఇదిగో, ఇటుచూడు! ఈపైన ఎప్పుడైనా ఇవి మిగిలినట్లుచూశానో ఊరుకోను సుమా! ఒక్కటన్నా మిగల్చకుండా తినేయాలి తెలుసా? ఆ.... లేకపోతే నా సంగతి తెలుసుకదూ?" అనేవాడు.

తల్లి వచ్చింది తీసుకెళ్ళడానికి. భార్యను పంపడం విశ్వానికెంతమాత్రమూ యిష్టం లేదు. అలాగని ఆమెను ఆపనూలేదు. తన యిష్టాయిష్టాలను తెలుసుకోకుండా తల్లి రాగానే సంభ్రమంతో బైలుదేరే భార్యను చూస్తుంటే అతనికి చాల కోపంగా ఉంది. కోపోద్రేకంతో ఊగిపోతూ అన్నాడు భార్యతో "చూడు, నాకు ఆడపిల్ల అంటేనే యిష్టం సుమా! నువ్వుగాని మొగపిల్లాడిని కన్నావో, వాడిపీక పిసికి, నీప్రాణాలుకూడా తీసేస్తాను తెలుసా? ఒకవేళ నీపుట్టింటి వాళ్ళ అండ చూసుకుని కులుకుతావేమో. ఇక నీ బ్రతుకంతా పుట్టింటిలోనే వెళ్ళ మారుద్దుగాని." కర్కశమైన స్వరంతో చెబుతుంటే నాగరత్నం అదిరిపడింది.

భర్తకి ఒక అభిప్రాయమంటూ కలిగిందంటే దానిని మార్చడం హరిహరాదులకు కూడా శక్యం కాదని తెలుసామెకు. అందుకే చెమ్మగిల్లిన కళ్ళను వత్తుకుంటూ ఎలాగో యివతలపడింది.


భార్యను బెదిరించడానికి అన్నప్పటికీ నిజాని కతనికి ఆడపిల్ల అంటే చాల యిష్టము, ప్రేమాను. ఇరుగు పొరుగు ఇంటి పసిపాపలతో ఆడుతూ కూర్చుంటాడు. వాళ్ళకి రకరకాల ఆట బొమ్మలుతెచ్చి బహూకరించి, వాళ్ళు మురిసిపోతుంటే చూసి సంతోషిస్తాడు. తన చిన్నతనంనుంచీకూడా నాకో చెల్లెలుంటే ఎంత బాగుండును అనుకునేవాడు. తల్లి ఆడ పిల్లలమీదగల మోజు కొద్దీ కొడుకునే కూతురులా అలంకరించి ఆ ముచ్చట తీర్చుకునేది.

తన తల్లికి ఆడపిల్లలంటే చాలయిష్టమని అతనికి తెలుసు. తల్లికోసమైనా తనకో ఆడపిల్ల పుడితే ఎంతబాగుణ్ణు' అని అతని ఊహ. కాని భార్య ఆడపిల్లనుగాక మొగపిల్లాడిని ప్రసవించిదని తెలుస్తే ఏంచేస్తాడో ఆపిచ్చి మానవుడు?

● ● ●

నాగరత్నం పూర్తి స్పృహలోకి వచ్చేసరికి కనీసం ఒకగంటన్నా జరిగివుంటుంది. కళ్ళువిప్పి చుట్టూ చూసింది. తల్లి ఆదుర్దాగా తనవైపే చూస్తున్నది. కూతురు కనులు తెరవగానే "అమ్మలూ"అంది అనురాగంగా. నాగరత్నానికింకా అనుమానం తీరలేదు. తనకుపుట్టిన బిడ్డ ఆడో మొగో తల్లినడిగితే? కాని ఏదో సిగ్గు, తెలియని భయంతో ఆమె నోరుపెగలనేలేదు. మరి కాసేపటికి మంత్రసాని ఒక పసిబిడ్డతో అక్కడకు వస్తూనే "గుమ్మడిపండంటి అబ్బాయిని గన్నావు, కరువుతీరేలా చూసుకోవమ్మా." అని మేలమాడుతూ ఆ బిడ్డను నాగరత్నం ప్రక్కనే పడుకోబెట్టి వెళ్ళిపోయింది;






కన్నకొడుకుని కంటితో చూసుకోగానే అంతవరకు ఆమెను పీడిస్తున్న దిగులు, భయ సంకోచాలు ఎగిరిపోయాయి. కడుపుకోతాటు మనసుకూడా చాలా తేలికనిపించింది. చెయ్యివేసి నెమ్మదిగా అప్యాయతగా నిమిరింది కొడుకు శరీరాన్ని. చేతికి అతి మెత్తగా, పూవుకన్న మృదువుగా, బిడ్డ దేహం తగులుతుంటే ఏదో పారవశ్యంలో క్షణం తన్మయురాలై కళ్ళు అర్ధనిమీలితాలై పసిబిడ్డనే చూస్తుండిపోయింది

ఇటువంటి బిడ్డ కలగాలని ఎంతమంది యువతులు ఎన్ని కలలు గంటున్నారో? ఎవరికీ దొరకని అదృష్టమేదో తనకి కలిగినట్లు సంతోషంతో పొంగిపోయిందామె హృదయం. తనెంత పాపిష్టురాలు ఈ బిడ్డ వద్దని ఎన్ని దేవుళ్ళకు మ్రొక్కుకుంది ... ఏమైనాగానియ్యి. తన సంసారం విచ్ఛిన్నమైనాసరే ముద్దులు మూటగట్టే ఈ పసివాడిని వదులుకోలేదు. ఆ బిడ్డను చూస్తుంటే ఆమెకు గర్వం, ఏదో ధైర్యం, నిర్వచించలేని ఆనందోత్సాహాలు పెల్లుబుకుతున్నాయి.

అప్పటికప్పుడే ఎన్నో ఊహలు, తన కొడుకు తండ్రి అడుగుజాడల్లోగాక, ఎంతో బుద్ధిమంతుడైనట్లు పెద్దలంటే భక్తి, గౌరవాలు చూపిస్తున్నట్లు, ఆడపిల్లలను తన తోబుట్టువుల్లా తలచి, గౌరవిస్తున్నట్లు ఇట్లా ఎన్నో ఎన్నో ఆలోచనలు, ఊహాగానం చేస్తూ నిద్రపోయింది నాగరత్నం.

ఆ రోజే పురిటి స్నానం. తల్లి, బిడ్డ ఆరోగ్యంగానే ఉన్నందున, ఆ రోజే స్నానం చేయించారు. అంతవరకు అత్తవారింటి వద్దనుంచి ఎవరూ రాలేదు. కబురు పెట్టినా ఎందుకు రాలేదో? వారికి కోపం వచ్చిందేమో. ఆ కోపాన్ని ఈవిధంగా తీర్చుకుంటున్నారు కాబోలు అనుకుంది నాగరత్నం. భయంతో ఆమె మనసు ఏదో శంకిస్తున్నది. ఆ భయానికి నిర్వచనం చెప్పుకోలేక లోలోపలే బాధపడుతున్నది.

పుట్టినప్పుడు కాస్త సన్నగా ఉన్నప్పటికీ ఈ పదకొండు రోజుల్లోనే ఒళ్ళుచేసి బొద్దుగా, చూపులకు ముద్దు గొలుపుతూ ఉన్నాడు. బంగారు రంగుతో పోటీచేసే దేహంమీద తెల్లటి గ్లాస్కో చొక్కా, చేతికి మురుగులు, మెడలో పులిగోరు పతకం, కళ్ళకు కాటుకా, దిష్టిబొట్టుతో అలంకరించిన కొడుకుని ఒడిలో పెట్టుకొని కూర్చుంది నాగరత్నం. బాలింత రూపంలో కొత్త అందాన్ని పుంజుకొని చూపరులను ఆకర్షించేలా ఉంది నాగరత్నం కూడా. కూతురికి, మనుమడికి ఎక్కడ దృష్టి తగులుతుందో అని అందరూ వెళ్ళాక ఇన్ని మిరపకాయలు తెచ్చి కూతురుకి, మనుమడికి దిష్టితీసి పొయ్యిలో పోసివచ్చింది చిట్టెమ్మగారు.

తల్లి చాదస్తానికి నవ్వుకుంది నాగరత్నం.

"ఇప్పుడు పిచ్చిలా నవ్వులాటగానే ఉంటుంది గాని కొన్ని రోజులు పోనియ్యమ్మా నీకే తెలిసివస్తుంది, కన్న 'మమకారం, మాతృత్వపు ప్రేమాను" అంది చిట్టెమ్మగారు వెళ్ళిపోతూ; అంతలోనే తిరిగొచ్చి కంగారుగా "అల్లుడుగారొస్తున్నారే, రత్నం' అంటూనే గబగబ లోపలకెళ్ళిపోయిందామె.

విశ్వం బండివాడికి డబ్బులిచ్చి, గుమ్మం బైట చెప్పులువిడిచి లోపలకు నడిచాడు. అతనికళ్ళు దేనికోసమో వెతుకుతున్నాయి ఆత్రుతగా. అతనికి అత్తగారింట్లో అంత చనువులేదు. పెళ్ళయ్యాక ఈ అయిదు సంవత్సరాలలోనూ ఏ రెండు, మూడుసారులోవచ్చి ఉంటాడంతే. అందుకే అతనికి అత్తగారితో మాట్లాడాలంటే ప్రాణసంకటంగా ఉంటుంది తను వచ్చి అయిదు నిమిషాలు పైనే అయింది. అయినా ఒక్కళ్ళూ కనిపించరేం? ఎదురుగా కనిపించని భార్యమీద అత్తమామలమీద విసుక్కున్నాడు కాస్సేపు. అతని హృదయం దేనికోసమో తపిస్తున్నది. సిగ్గూ సంకోచాల వలన అక్కడే తచ్చాడుతూ నిల్చున్నాడు. ఇంతలో గుమ్మం ప్రక్కగా గాజులు గలగల్లాడినవి. ఉత్సాహంగా తలెత్తి అటు చూశాడు అత్తగారు చెంబుతో నీళ్ళు తెచ్చి అక్కడ పెడుతూ "కాళ్ళు కడుక్కో నాయనా" అంది ఆదరంగా.

ఎటూ చూడకుండా చప్పున చెంబు అందుకని కాళ్ళమీద గుమ్మరించుకొచ్చాడు. కాళ్ళు చల్లపడగానే హృదయంకూడ కాస్త చల్లబడ్డట్టయ్యింది.

"భోజనానికి లేస్తారా? కాఫీ తెమ్మంటారా" అడుగుతున్న అత్తగారిని చూస్తుంటే అతగానికి అరికాలిమంట నెత్తికెక్కినట్లయింది. తను అంతదూరంనుంచి పరుగెత్తుకొచ్చింది, అన్నం కాఫీలకోసమా?

"నేను కాఫీ ఫలహారాలు తీసుకునే వచ్చానులెండి. ఇప్పుడా ప్రయత్నాలేమీ చేయవద్దు" అన్నాడు తెచ్చికోలు వినయంతో. అంతకంటె కఠినంగా మాట్లాడా లనుకునికూడా మాట్లాడలేకపోయాడు.

అల్లుని కా ఆత్రుత ఎందుకో కనిపెట్టిన అత్తగారు చిన్నగా నవ్వుకుంది. కొత్తగా పితృస్థానం పొందిన ప్రతి యువకుని మనసు యిట్లాగే ఉంటుంది అనుకుంది. "అదిగో ఆ గదిలో ఉంది అమ్మాయి" అంది అక్కడనుంచి తప్పుకుంటూ.

ఆ గదిలో నాగరత్నం చలనంలేని బొమ్మలా బిగుసుకుపోయి కూర్చుంది. అల్లుడు వచ్చాడనగానే ఆమె ఉత్సాహమంతా చల్లారిపోయింది. ఆయన ముఖంలో ఏం చూడాల్సివస్తుందో, ఆ నోటిలోంచి ఎంత కఠినమైన మాటలు వినాల్సి వస్తుందో? ఒడిలో బిడ్డడు నిద్రపోతున్నాడు మత్తుగా. తన బిడ్డకు ఏ అపాయము కలుగకూడదని కాబోలు ఒక చెయ్యి బిడ్డ శరీరంమీదవేసి రాబోయే సన్నివేశానికి ఆయత్తపడేలా కూర్చుంది బింకంగా.

పరిచితమైన పద ధ్వని బరువుగా పడుతూ చేరువకొస్తున్నది. నాగరత్నం గుండె వేగంగా, అతి వేగంగా కొట్టుకుంటున్నది. అప్పుడు జరుగబోయే సన్నివేశాన్ని ముందే ఊహించుకున్నందున కాబోలు, భయోద్వేగాలతో ఆపాదమస్తకం కంపిస్తున్నదామె. అప్పుడే లోపల కడుగుపెట్టాడతను. చప్పుడుకి తలెత్తి చూసింది ఇద్దరి నేత్రాలు కలుసుకున్నాయి. నాగరత్నం చూపుల్లో 'నా బిడ్డను ఏమీ చేయరుకదూ?' అనే ప్రార్థన ప్రస్ఫుట మవుతున్నది. అతని చూపుల్లో వెఱ్ఱి ఆనందం, ఎనలేని ఉత్సాహం ద్యోతక మవుతున్నాయి. ఆ చూపుల భావం అర్థంచేసుకోలేని రత్నం బెదిరిపోతూ కళ్ళు వాల్చేసుకుంది. బిడ్డచుట్టూ ఉన్న ఆమె చేతులు మరింత బిగుస్తున్నాయి. హరి బ్రహ్మాదులు దిగివచ్చినా ఆ చేతులనుండి ఆ బిడ్డను వేరుచేయలేరనే దృఢనిశ్చయాన్ని వ్యక్తంచేస్తూ.

కాని అతని భావాలు మరోలా పరుగులు తీస్తున్నాయి. అతని కంటికి నాగరత్నం పూర్వంలా కనుపించడంలేదు. అంతకంటె ఎన్నోరెట్లు అందంగా ఆకర్షణీయంగా కనిస్తున్నది. పొడి వెంట్రుకలు పాయలుతీసి అల్లినప్పటికీ, జడలో యిమడని కొంటెగి వెంట్రుకలు మెలికలు తిరిగి చెంపలవెంట కదం త్రొక్కుతుంటే పచ్చటి ముఖానికి వింత శోభను గూరుస్తున్నవి. ఒత్తుగా కాటుక దిద్దుకున్న కనులు, నుదురు మధ్యలో రక్త సింధూరంలా మెరిసిపోయే కుంకుమబొట్టు మాతృత్వపు వైభవం చాటుతూ ఉబికిన వక్షోజాలు, చిక్కిన చక్కని దేహానికి వచ్చిచేరిన అందానికి ముగ్ధుడౌతూ, తన్మయత్వంతో మత్తుగా నడిచాడు ముందుకి.

ఎదురు చూసిన ఆ క్షణం వచ్చేసింది. అబ్బ! భయాందోళిత హృదయంతో కళ్ళు మూసుకుంది రత్నం. వెంటనే ఉలిక్కిపడుతూ "ఇదేమిటి! ఎవరు తనని బంధించారు" అనుకుంటూ కళ్ళు తెరచి చూసింది. భర్త తన ప్రక్కనే కూర్చుని తనచుట్టూ చేతులువేసి తన తలను గుండెల కదుముకున్నాడు. ఎదురుచూడని సన్నివేశం! ఆ సమయంలో సంతోషించాలో విచారించాలో తెలియలేదు రత్నానికి. అయినా మనసు కూడదీసుకుని పొడారిన గొంతుతో అంది "అబ్బాయి" అని తడబడుతూ.

"చూశాను, ఎంత బాగున్నాడో. అంతా నీపోలికే వచ్చింది, అబ్బాయి అమ్మపోలికైతే అదృష్టంకదూ? నువ్వు ...నువ్వు, నిజంగా ఎంత బాగున్నావు? నీలో ఇంతందము, ఆకర్షణ ఉన్నాయని నా కిన్నాళ్ళు తెలియదు. మూర్ఖుడిని, నన్ను క్షమించవూ, ఇన్నాళ్ళు నిన్నుబాధపెట్టినందుకు?" అంటూనే బిడ్డతోసహా భార్యను గుండెల కదుముకున్నాడు.

భర్తలో కలిగిన మార్పుకు ఉప్పొంగిపోతూ "నాకిదే చాలు. ఈ అదృష్టాన్ని ఎప్పుడూ ఇలా ఉండేలా చెయ్యి ప్రభూ" అనుకుంది నాగరత్నం, ఆనందంతో చెమర్చిన కళ్ళను తుడుచుకుంటూ. 000